# 'జిరంగీ - జిక్కీస్ పిట్టా'

లక్షింబాయీ, సీతాపతీ, నేనూ ఓ జట్టు.

లక్షింబాయి అన్న మోహన్గాడొక్కడింకో జట్టు. వాడు రౌడీ. ప్రతి నాయకుడు, విలన్గాడన్నమాట. సన్నగా పీలగా ఉండే నన్నూ సీతగాడినీ అయిన దానికి కానిదానికి చితకదన్నేవాడు.

మాకు బూతులు నేర్పింది వాడే...

వాడు మాకంటే మూడేళ్లు పెద్దైనా మా క్లాసే...

నన్ను 'ఒరేయ్ బ్యాపనోడో' అని పిల్చేవాడు. అది ఏదో తిట్టులాగా అనిపించేది నాకు. ఉక్రోషమొచ్చినా వాణ్ణేమీ చేయలేక ఉడుక్కునేవాణ్ణి. (ఇప్పుడు బ్రాహ్మడు అంటే తిట్టే అయిపోయింది. ఇంగ్లీషు భాషలో 'యూఫిమిజం' అంటారు. అగ్రవర్ణ జాతి అంటే ఓ నరహంతక జాతి కింద వాడబడ్తోంది... సర్లెండి దాని గురించి మరెప్పుడైనా మాట్లాడుకుందాం.)

ఒకసారి బొంగరాలాడుతున్నాం...

ఆట పేరు 'బళ్ళారి గుమ్మా'...ఓడినవాడి బొంగరాన్ని నేలలో దిగేసి గెలిచిన వాళ్ళు మళ్ళీ బొంగరాల ములుకుల్తో దెబ్బలేస్తారు.

బొంగరాన్ని తిప్పి జాలె (తాడు)తో చుట్టు ఎగరేసి చేతిలో వేసుకు తిప్పడాన్ని మా కర్నూల్లో 'మంగ' అంటారు.

మోహన్గాడు అసలు బొంగరాన్ని నేలమీదాడించకుండానే గాల్లోనే తిప్పి చేతిలో వేసుకునేవాడు... ఆ కళని 'అంతర్జాల' అనేవాళ్ళం. నన్నూ సీతగాణ్ణి సతాయించి సతాయించి రకరకాల లంచాలు తీసుకుని ఆ కళ మాకు చాల్రోజులకు నేర్పాడు.

ఆ 'బళ్ళారి గుమ్మా' ఆటలో నేనోడిపోయా (అది మామూలే). నా బొంగరం మోహన్గాడి దెబ్బలకి రెండుగా విచ్చిపోయి హృదయ విదారకంగా పగిలిపోయింది. నాకేడుపొచ్చింది. వాణ్ణి ఏమీ చేయలేక వాడు నేర్పిన బూతు తిట్టే తిట్టి పరిగెత్తా... వాడు నిమిషంలో నన్నందుకని చావగొట్టడం మొదలు పెట్టాడు. సీతగాడు నాకు సపోర్ట్ వచ్చాడు. నేనూ సీతగాడు ఇద్దరం కలిసి కలబడినా లాభం లేకపోయింది. చితకతన్నిందికాక ఆ

మోహన్గాడు 'ఓరే బ్యాపనోడా! ఆకులూ అలములూ తింటే కండెక్కడొస్తుందిరా మా లెక్క సియ్యల్దినాట్రా" అని గేలి చేశాడు. పుండు మీద కారం... ఏమీ చేయలేను. ఉడుక్కుంటూ మరిమరి సీతగాడు కూడా మాంసం తింటాడు గదరా వాడూ నా మాదిరే బక్కగా ఉన్నాడే" అన్నా రోషంగా, "వాడెక్కడ తింటాడ్రా ఎప్పుడో నెలకోసారి అంతే" అన్నాడు మోహన్గాడు నిరసనగా.

పేదరికం గురించి అంత దిగంబరంగా మాట్లాడించగలిగేది బాల్యపు అమాయకత్వమేమో...

సీతగాడి బుద్ధి చాలా పదును... అంతలావు మోహన్గాడు దేనికి భయపడ్తాడో కనుక్కున్నాడు...

వాడు భయపడేది జీరంగి పురుగుకు. దాన్ని చూస్తే ఆమడదూరం పరిగెత్తేవాడు 'కంపు – కంపు' అంటూ. లక్షింబాయి (లక్ష్మీబాయి) క్కూడా దాని అన్నంటే మంట. దాన్ని కూడా అయిన దానికి కానిదానికీ చితకదన్నేవాడు. నేనూ లక్షింబాయి సీతగాడు ముగ్గురం మోహన్గాడి మీద పగ తీర్చుకోవాలని నిర్ణయించుకున్నాం.

ఓ నాలుగు జీరంగుల్ని తెచ్చి మోహన్గాడి పుస్తకాల సంచిలో వేయాలన్న నిర్ణయం జరిగిపోయింది. సాయంత్రం గచ్చ పొదల కెళ్ళి ఓ నాలుగు జీరంగుల్ని అగ్గిపెట్టెలో పట్టి బంధించాం.

"అరేయ్ అక్కడ జిక్కిస్ పిట్టలుంటాయి. ఒక జిక్కీస్‌ను కూడా పడదాంరా" సీతగాడన్నాడు. అని వాడే ఓ పాత దోమతెర చింపి ఓ వల కూడా తయారుచేశాడు. సాయంత్రం లక్షింబాయీ, సీతగాడూ, నేనూ ముగ్గురం గచ్చపొదలకెళ్ళాం... లక్ష్మీబాయి గచ్చకాయల కోసమొచ్చిందసలు. ముదురు గోధుమ రంగు ఆల్చిప్పలాంటి గచ్చకాయలు తెరిస్తే రెండో మూడో విత్తనాలుండేవి. ఆ విత్తనాల్నే గచ్చకాయలనేవాళ్ళం. బూడిదరంగులో నున్నగా అందంగా ఉండేవి అవి. సరే ఓ మూడు కంపుకొట్టే జీరంగి పురుగుల్ని అగ్గిపెట్లో తుమ్మాకుతోపాటు వేసి ఓ జిక్కీస్ పిట్టను పట్టి దాన్నలాగే సుంకేసుల చెట్టుకొమ్మకు వేలాడదీసి చీకటిపడ్తోండగా ఇళ్ళకు చేరుకున్నాం. జీరంగుల అగ్గిపెట్టెను మురుగు కాలువ బ్రిడ్జి సందులో దాచాం. ఉదయం నేను ఆ అగ్గిపెట్టెను తీసుకుని రావాలని నిర్ణయం.

మర్నట్రోజు నేను బ్రిడ్జి దగ్గరకెళ్ళి జీరంగుల అగ్గిపెట్టెను జేబులో వేసుకుని బడికెళ్ళా... సీతగాడు కనిపించలేదు... పిల్లలంతా ఈరోజు సెలవు సెలవు అంటూ వెళ్ళిపోతున్నారు. ఎందుకు సెలవిచ్చారో ఎవరికాక్కావాలి, మోహన్గాడిని భయపడించే ఛాన్సు పోయిందని నేను దిగులుపడ్డాను. తర్వాత ఓ గంటకు నేనూహించని వార్త విన్నాను,

నమ్మలేకపోయాను. మోహన్గాడింటికి వెళ్ళాను... 'హో'మని ఏడ్పులు వినబడుతున్నాయి. లోపలికెళ్తే మోహన్గాడు శవమై పడుకుని ఉన్నాడు... లక్షింబాయి ఏడుస్తోంది... సీతగాడు అయిపులేడు.

మెహన్గాడు, జాన్ పీటర్గాడూ ఉదయాన్నే ఈతకని కేసి కేనాల్కు వెళ్ళి మునిగి చనిపోయారట. దిక్కుతోచని స్థితి... చిన్నగా నడుస్తూ గచ్చపొదల దగ్గరికెళ్ళా... అగ్గిపెట్టెలో జీరంగి పురుగుల్ని విదిలించేశా... సుంకేశుల కొమ్మకు దీనంగా వేలాడ్తోన్న జిక్కీస్ను వదిలి గట్టిగా అరిచా 'జిక్కీస్ పిట్టా ఎగిరిపో' అని.

కొన్ని దశాబ్దాల తర్వాత ఇప్పుడనిపిస్తుంది మోహన్గాడు చనిపోడానికి 'జిక్కీస్పిట్టా ఎగిరిపో' అని నేనరవడం ఓ కళాత్మక సంకేతంలా ఉందని.

ఓ వెర్రినవ్వు మొలుస్తుంది.

* * *

***గలించిపోయిన కొన్ని విషాద సంఘటనలు కాలక్రమేణా వాటిలోని విషాదాన్ని వదల్చుకొని కళాత్మకంగా కనిపించడం జీవితంలోని అసలు విషాదం.*** ●